అనుపమ సంచలనం

ప్రపంచ 15వ ర్యాంకర్‌పై అద్భుత విజయం

ప్రిక్వార్టర్స్‌కు సుమిత్, సిక్కిరెడ్డి జోడీ.. చైనా మాస్టర్స్

పెన్‌జెన్ (చైనా): భారత యువ షట్లర్ అనుపమ ఉపాధ్యాయ.. చైనా మాస్టర్స్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నీ తొలి రౌండ్‌లో సంచలన విజయం సాధించింది. మంగళవారం ఇక్కడ జరిగిన మహిళల సింగిల్స్ మొదటి రౌండ్‌లో 19 ఏండ్ల అనుపమ.. 21-17, 8-21, 22-20తో ప్రపంచ 15వ ర్యాంకర్ బీవెన్ జెంగ్ (అమెరికా)ను ఓడించింది. 48 నిమిషాల పాటు హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో ఆమె ఆరంభం నుంచే దూకుడు ప్రదర్శించి మొదటి గేమ్‌లో 11-3 ఆధిక్యం సాధించింది. తర్వాత జెంగ్ కోలుకున్నా అప్పటికే ఆధిక్యంలో ఉన్న అనుపమ ఆ గేమ్‌ను సొంతం చేసుకుంది. కానీ రెండో గేమ్‌లో జెంగ్ పుంజుకుంది. నిర్ణయాత్మక మూడో గేమ్ ఒకదశలో ఇరువురు 20-20తో సమంగా నిలిచినప్పటికీ జెంగ్ చేసిన తప్పిదాలను సద్వినియోగం చేసుకున్న భారత షట్లర్ మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో భార్యాభర్తల జంట సుమిత్‌రెడ్డి-సిక్కిరెడ్డి 23-21, 17-21, 21-17తో ప్రెస్లీ స్మిత్, జెన్నీ (అమెరికా)ను ఓడించి ప్రిక్వార్టర్స్‌కు చేరింది. పురుషుల సింగిల్స్‌లో ప్రియాన్షు రజావత్, మహిళల సింగిల్స్‌లో ఆకర్షి కశ్యప్ తొలి రౌండ్‌లోనే ఇంటిబాట పట్టారు.

భారత్‌కు ఇబ్బందులుంటే మాతో మాట్లాడాలి

- హైబ్రిడ్‌కు ఆస్కారమే లేదు: పీసీబీ చీఫ్

కరాచీ: వచ్చే ఏడాది ఫిబ్రవరిలో పాకిస్థాన్ ఆతిథ్యమివ్వనున్న ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో ఆడేది లేదని తేల్చిచెప్పిన భారత్.. భద్రత విషయంలో ఏమైనా ఇబ్బందులుంటే తమతో మాట్లాడాలని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) చీఫ్ మోహ్సిన్ నఖ్వీ అన్నారు. మంగళవారం కరాచీలోని గడాఫీ స్టేడియంలో తనను కలిసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. 'చాంపియన్స్ ట్రోఫీకి అర్హత సాధించిన ప్రతి దేశం ఇక్కడకు రావడానికి అంగీకారం తెలిపింది. ఎవరికీ ఏ ఇబ్బందీ లేదు. నేను ఇప్పటికీ ఒకటే చెబుతున్నా.. భారత్‌కు భద్రత విషయంలో ఏమైనా సమస్యలుంటే మాతో మాట్లాడాలి. మేం వాటిని పరిష్కరిస్తాం' అని తెలిపారు. భారత్ పాకిస్థాన్‌కు ఎందుకు రావడం లేదో కారణాలను తెలుపుతూ తమకు వివరణ ఇవ్వాలని ఐసీసీని కోరామని, దీనిపై తమకు సానుకూల సమాధానం వస్తుందని ఆశిస్తున్నట్టు తెలిపారు.

లంకేయులదే వన్డే సిరీస్

పల్లెకెలె: ఇటీవలే భారత్‌ను భారత్‌లో ఓడించి చారిత్రక టెస్టు సిరీస్‌ను సొంతం చేసుకున్న న్యూజిలాండ్‌కు శ్రీలంక స్వదేశంలో చుక్కలు చూపించింది. ఇరు జట్ల మధ్య జరిగిన మూడు వన్డేల సిరీస్‌ను లంకేయులు 2-0తో గెలుచుకున్నారు. తొలి రెండు వన్డేల్లో లంక గెలవగా మంగళవారం జరగాల్సిన మూడో వన్డే వర్షం కారణంగా అర్థాంతరంగా రద్దయ్యింది. వాన వల్ల ఆట ఆగే సమయానికి కివీస్ 21 ఓవర్లలో 1 వికెట్ నష్టపోయి 112 పరుగులు చేసింది. అంతకుముందు జరిగిన టెస్టు సిరీస్‌నూ లంక 2-0తో క్లీన్‌స్వీప్ చేయగా రెండు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను ఇరు జట్లూ పంచుకున్నాయి.

ఢిల్లీని వీడింది డబ్బు కోసం కాదు

- రిషభ్ పంత్ క్లారిటీ

ఢిల్లీ: తన ఐపీఎల్ కెరీర్ ఆరంభం నుంచి గత సీజన్ దాకా ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఆడిన వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్‌ను ఈసారి ఆ ఫ్రాంచైజీ రిటైన్ చేసుకోలేదు. రిటెన్షన్ ఫీజు విషయంలోనే పంత్.. ఢిల్లీ యాజమాన్యంతో విభేదించాడని అప్పట్లో పుకార్లు షికార్లు చేశాయి. తాజాగా దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ కూడా స్టార్ స్పోర్ట్స్‌తో మాట్లాడుతూ ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేసిన నేపథ్యంలో పంత్ స్పందించాడు. 'నా రిటెన్షన్ అంశం డబ్బుతో ముడిపడి లేదని నేను కచ్చితంగా చెప్పగలను' అని గవాస్కర్ మాట్లాడిన వీడియోకు ఎక్స్‌లో రిప్లై ఇచ్చాడు.

షఫాలీపై వేటు

ఢిల్లీ: వచ్చే నెలలో ఆస్ట్రేలియాతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ఆడనున్న భారత మహిళల జట్టులో యువ ఓపెనర్ షఫాలీ వర్మ చోటు కోల్పోయింది. ఈ ఏడాది వన్డేలలో పేలవ ఫామ్‌తో తంటాలు పడుతున్న షఫాలీపై సెలక్టర్లు వేటు వేశారు. 2024లో ఆడిన 6 వన్డేలలో షఫాలీ 108 పరుగులు మాత్రమే చేసింది. ఆమెతో పాటు న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్ ఆడిన జట్టులోని ఉమా, హేమలత, శ్రేయాంక, సయాలికి సైతం సెలక్టర్లు షాకిచ్చారు.

పుణెరి, యూపీ పోరు టై

నోయిడా: ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్)లో మరో ఉత్కంఠ పోరు అభిమానులను ఊపేసింది. మంగళవారం డిఫెండింగ్ చాంపియన్ పుణెరి పల్టన్, యూపీ యోధాస్ మధ్య జరిగిన మ్యాచ్ 29-29 పాయింట్లతో టై గా ముగిసింది. ఆట నిర్దేశిత సమయానికి ఇరు జట్ల స్కోర్లు సమానం కావడంతో రెండు జట్లకూ తలా 3 పాయింట్లు దక్కాయి. యూపీ తరపున భవానీ రాజ్‌పుత్ 10 పాయింట్లతో మెరవగా పూణె కెప్టెన్ మోహిత్ 9 పాయింట్లు సాధించాడు. మరో మ్యాచ్‌లో పాట్నా.. 54-31తో బెంగళూరుపై విజయం సాధించింది.

ఫైనల్‌కు భారత్

సెమీస్‌లో జపాన్‌పై గెలుపు • తుదిపోరులో చైనాతో అమీతుమీ

రాజ్‌గిర్ (బీహార్): మహిళల ఆసియా కప్ హాకీ టోర్నమెంట్‌లో భారత్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. లీగ్ దశలో ఆడిన మ్యాచ్‌లన్నీ గెలిచి అజేయంగా నిలిచిన భారత్.. సెమీస్‌లో 2-0తో జపాన్‌ను చిత్తుచేసి వరుసగా రెండోసారి కప్‌ను సొంతం చేసుకునే దిశగా ముందడుగు వేసింది. భారత్ తరఫున వైస్ కెప్టెన్ నవ్‌నీత్ కౌర్ 48వ నిమిషంలో తొలి గోల్ కొట్టగా లాల్‌రెమ్సియామి 56వ నిమిషంలో రెండో గోల్ చేసింది. ఫైనల్‌లో మన అమ్మాయిలు..ఒలింపిక్స్ రజత పతక విజేత చైనాతో అమీతుమీ తేల్చుకోనున్నారు. మొదటి సెమీస్‌లో చైనా.. 3-1తో మలేషియాను ఓడించి ఫైనల్‌కు అర్హత సాధించింది. బుధవారం ఫైనల్ పోరు జరుగనుంది. ఈ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన భారత్ సెమీస్‌లో ప్రత్యర్థిపై ఆధిపత్యం చెలాయించినా మరింత భారీ తేడాతో గెలిచే అవకాశాన్ని చేజార్చుకుంది. ఈ మ్యాచ్‌లో ఏకంగా 13 పెనాల్టీ కార్నర్ (పీసీ)లను భారత్ గోల్స్‌గా మలచలేకపోయింది. జపాన్ గోల్‌పోస్ట్ లక్ష్యంగా మన స్టైకర్లు దూకుడుగా ఆడినా పెనాల్టీలను సద్వినియోగం చేసుకోలేకపోయారు. తొలి క్వార్టర్ ఐదో నిమిషంలోనే గోల్ చేసే అవకాశమొచ్చినా తొలి పెనాల్టీని సారథి సలీమా గోల్ చేయడంలో విఫలమైంది. మొదటి క్వార్టర్లోనే మరో రెండు పీసీలను భారత్ వృథా చేసుకుంది. 21, 24, 35, 47వ నిమిషాల్లోనూ పీసీ అవకాశాలు వచ్చినా వాటిని గోల్‌పోస్ట్ లోకి పంపించలేకపోయింది. జపాన్ గోల్‌కీపర్ కుడొ వాటిని సమర్థవంతంగా అడ్డుకుంది. ఈ టోర్నీ మూడో స్థానం కోసం జపాన్..మలేషియాతో ఆడనుంది. కొరియా ఐదో స్థానంతో సరిపెట్టుకోగా థాయ్‌లాండ్ ఆరో స్థానంతో ముగించింది.

కూర్పుపై కసరత్తు

ఓపెనర్‌గా రాహుల్

నితీశ్, పడిక్కల్ ఇద్దరిలో ఒకరికి చాన్స్

మిడిలార్డర్‌లో సర్ఫరాజ్, జురెల్ మధ్య పోటీ

భారత్ కీలక పోరుకు సిద్ధమైంది. సొంతగడ్డపై న్యూజిలాండ్ చేతిలో అనూహ్యంగా వైట్‌వాష్ ఎదుర్కొన్న టీమ్‌ఇండియాకు ప్రతిష్టాత్మక బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ రూపంలో పెద్ద సవాలు ఎదురుకాబోతున్నది. పెర్త్‌లో మొదలయ్యే తొలి టెస్టు కోసం అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నది. రోహిత్ గైర్హాజరీలో బుమ్రా కెప్టెన్సీ ఖరారు కాగా, ఓపెనర్ రాహుల్, మూడో నంబర్‌లో పడిక్కల్, పేస్ ఆల్‌రౌండర్‌గా నితీశ్‌రెడ్డి, మిడిలార్డర్‌లో జురెల్, సర్ఫరాజ్ మధ్య పోటీ ఏర్పడింది. తొలి టెస్టుకు ఎవరిని ఎంపిక చేయాలనే దానిపై కసరత్తు నడుస్తున్నది.

పెర్త్: గత రెండు పర్యాయాలు అసలు ఎలాంటి అంచనాలు లేకుండా ఆస్ట్రేలియాను వారి సొంతగడ్డపైనే చిత్తు చేసి చారిత్రక విజయాలు సొంతం చేసుకున్న భారత్ ఈసారి దీటైన పోటీని ఎదుర్కొనే అవకాశముంది. గతానికి పూర్తి భిన్నంగా ఈసారి కంగారూ జట్టు..టీమ్‌ఇండియాకు చెక్ పెట్టేందుకు అన్ని రకాలుగా సిద్ధమవుతున్నది. ఈ నేపథ్యంలో ఆసీస్‌ను ఎలా ఎదుర్కొవాలనే దానిపై టీమ్ ఇండియా మేనేజ్‌మెంట్ ప్రణాళికలు రచిస్తున్నది. పెర్త్ వేదికగా శుక్రవారం నుంచి మొదలయ్యే తొలి టెస్టు కోసం తుది జట్టు ఎంపికపై దృష్టి సారించింది. రెగ్యులర్ కెప్టెన్ రోహిత్ శర్మ స్వదేశంలోనే ఉండిపోగా, ప్రాక్టీస్ మ్యాచ్‌లోగిల్ గాయపడ్డాడు. దీంతో జట్టులోకి ఎవరిని తీసుకుంటారన్న దానిపై ఆసక్తి నెలకొన్నది. గత అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని జైస్వాల్‌కు జతగా రాహుల్‌ను ఓపెనర్‌గా పంపే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రాక్టీస్‌లో గాయపడి తేరుకున్న రాహుల్..పూర్తి ఫిట్‌నెస్ సాధించినట్లు కనిపిస్తున్నది. మంగళవారం నెట్స్‌లో డిఫెన్స్‌పై ప్రధానంగా దృష్టి పెట్టిన రాహుల్..జైస్వాల్‌తో ఇన్నింగ్స్‌ను ప్రారంభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీనికి తోడు గతంలో ఓపెనింగ్‌కు వచ్చిన అనుభవంతో రాహుల్ వైపు మేనేజ్‌మెంట్ మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తున్నది. మరోవైపు సిరీస్‌కు సన్నాహకంగా ఆస్ట్రేలియా 'ఏ'తో జరిగిన అనధికారిక టెస్టుల్లో మెరుగ్గా రాణించిన పడిక్కల్‌ను మూడో నంబర్‌లో దింపే చాన్స్ కనిపిస్తున్నాయి. నెట్ ప్రాక్టీస్‌లో పడిక్కల్ చాలా సేపు గడపడం దీనికి మరింత బలాన్ని చేకూరుస్తున్నది.

నితీశ్ అరంగేట్రం!

ఇప్పటికే పొట్టి ఫార్మాట్‌లో ఆల్‌రౌండర్‌గా నిరూపించుకున్న ఆంధ్ర క్రికెటర్ నితీశ్‌కుమార్‌రెడ్డి.. పెర్త్ టెస్టు ద్వారా టెస్టు టీమ్‌లోకి వచ్చే చాన్స్ ఉంది. పేస్ ఆల్‌రౌండర్‌గా నితీశ్ ఎంపికైతే జట్టుకు లాభించే అవకాశముంది. లోయర్డర్‌లో బ్యాటింగ్‌కు తోడు ఉపయుక్తమైన పేస్ బౌలర్‌గా నితీశ్ సేవలు జట్టుకు బాగా లాభించనున్నాయి. బౌలింగ్ కోచ్ మోర్కెల్ పర్యవేక్షణలో నితీశ్ నెట్స్‌లో సుదీర్ఘంగా ప్రాక్టీస్ చేశాడు. అతని బౌలింగ్ లైనప్‌ను దగ్గరుండి పర్యవేక్షించిన మోర్కెల్ సలహాలు, సూచనలు ఇస్తూ కనిపించాడు. తనకు జోడీగా బుమ్రా పేస్ బౌలర్లలో ఎవరిని ఎంచుకుంటాడు అన్నది ఆసక్తికరంగా మారింది. సిరాజ్, ఆకాశ్‌దీప్, ప్రసిద్ధ్ కృష్ణ ఎవరు తుది జట్టులోకి వచ్చేది చూడాలి. మిడిలార్డర్‌లో జురెల్, సర్ఫరాజ్ మధ్య పోటీ ఏర్పడింది.

పాక్ పర్యటనకు అనుమతి నిరాకరణ

- భారత అంధుల జట్టుకు నిరాశ

న్యూఢిల్లీ: అంధుల టీ20 ప్రపంచకప్ కోసం పాకిస్థాన్ పర్యటనకు డిఫెండింగ్ చాంపియన్ భారత్ జట్టుకు అనుమతి లభించలేదు. భద్రతా కారణాల దృష్ట్యా పాక్‌కు వెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతివ్వలేదని జాతీయ అంధుల క్రికెట్ అసోసియేషన్ (ఐబీసీఏ) మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈనెల 23 నుంచి మొదలవుతున్న మెగాటోర్నీ కోసం భారత జట్టు బుధవారం వాఘా సరిహద్దు గుండా పాక్‌కు వెళ్లాల్సి ఉంది. అయితే ప్రపంచకప్‌నకు వెళ్లేందుకు క్రీడాశాఖ అనుమతిఇచ్చినా.. విదేశాంగ శాఖ క్లియరెన్స్ ఇవ్వకపోవడం నిరాశ కల్గించిందని ఐబీసీఏ ప్రధాన కార్యదర్శి శైలేంద్ర యాదవ్ పేర్కొన్నారు.

కొట్జెకు మందలింపు

దుబాయ్: దక్షిణాఫ్రికా పేసర్ గెరాల్డ్ కొట్జె మందలింపునకు గురయ్యాడు. జొహన్నెస్‌బర్గ్ వేదికగా భారత్‌తో జరిగిన చివరి టీ20 పోరులో అంపైర్ నిర్ణయాన్ని తప్పు పట్టినందుకు ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని ఐసీసీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. తాను వేసిన బంతిని వైడ్ ప్రకటించడం పట్ల అంపైర్‌పై కొట్జె అసహనం వ్యక్తం చేశాడు. మందలింపుతో పాటు డీమెరిట్ పాయింట్ ఎదుర్కొవాల్సి వచ్చింది.

శరవేగంగా 'ఫౌజీ'

ప్రభాస్ కథానాయకుడిగా హను రాఘవపూడి దర్శకత్వంలో ఓ పీరియాడిక్ చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్నది. ఇమాన్వి కథానాయిక. 1940 నాటి యుద్ధ నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లుగా సమాచారం. ప్రస్తుతం ఈ సినిమాపై ప్రభాస్ ఎక్కువగా ఫోకస్ పెట్టారని అంటున్నారు. ఇప్పటికే రెండు షెడ్యూల్స్ పూర్తయ్యాయని, నాయకానాయికలపై కొన్ని కీలకమైన ఘట్టాలను తెరకెక్కించారని తెలిసింది. దేశభక్తి ప్రధానంగా చిత్రీకరించిన సన్నివేశాలు అద్భుతంగా వచ్చాయని, ప్రభాస్ పాత్రను నవ్యరీతిలో ఆవిష్కరిస్తూ దర్శకుడు హను రాఘవపూడి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారని చెబుతున్నారు. ఈ చిత్రానికి 'ఫౌజీ' అనే టైటిల్ ప్రచారంలో ఉంది. ఇదిలా వుండగా ప్రభాస్ తాజా చిత్రం 'రాజాసాబ్' వచ్చే ఏడాది ఏప్రిల్ 10న విడుదలకు సిద్ధమవుతున్నది.

నాగచైతన్య జోడీగా..

ప్రస్తుతం తెలుగు చిత్రసీమలో పంజాబీ భామ మీనాక్షి చౌదరి హవా నడుస్తున్నది. ఈ ఏడాది వరుసగా భారీ సినిమాల్లో ఆమె అవకాశాలను సొంతం చేసుకుంది. ఇటీవల విడుదలైన 'లక్కీ భాస్కర్' చిత్రంతో కెరీర్‌లోనే మంచి విజయాన్ని దక్కించుకోవడం ఈ సొగసరికి బాగా కలిసొచ్చింది. మీనాక్షి చౌదరి కథానాయికగా నటించిన 'మెకానిక్ రాకీ' ఈ శుక్రవారం విడుదల కానుంది. మరో ఏడాది పాటు ఈ ముద్దుగుమ్మ డేట్స్ ఖాళీగా లేవని ఇండస్ట్రీలో వినిపిస్తున్నది. ఈ నేపథ్యంలో మీనాక్షి చౌదరి తెలుగులో మరో బంపరాఫర్‌ను దక్కించుకున్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే.. యువ హీరో నాగచైతన్య ప్రస్తుతం 'తండేల్' సినిమాలో నటిస్తున్నారు. ఈ సినిమా అనంతరం ఆయన 'విరూపాక్ష' ఫేమ్ కార్తీక్ వర్మ దండు దర్శకత్వంలో ఓ సినిమా చేయబోతున్నారు. స్క్రిప్ట్ వర్క్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలో సెట్స్‌మీదకు వెళ్లనుంది. ప్రస్తుతం కథానాయిక కోసం అన్వేషణ సాగుతున్నది. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాలో ఇద్దరు నాయికలకు చోటుందని, అందులో ఒకరిగా పూజాహెగ్డేను ఇప్పటికే ఖరారు చేయగా..రెండో నాయికగా మీనాక్షి చౌదరిని ఎంపిక చేశారని తెలిసింది. త్వరలో అధికారిక ప్రకటన రానుందని సమాచారం. చైతన్య సరసన మీనాక్షి చౌదరి నటించడం ఇదే తొలిసారి. వీరిద్దరి కాంబినేషన్ కొత్తగా ఉంటుందని చిత్రబృందం భావిస్తున్నట్లు తెలుస్తున్నది. ఇలా వరుసగా భారీ ఆఫర్లతో ఇండస్ట్రీలో లక్కీయెస్ట్ హీరోయిన్‌గా చెలామణి అవుతున్నది మీనాక్షి చౌదరి.

తల్లి పాత్రలో తొలిసారి

చిత్రం

బాలీవుడ్ కథానాయికల్లో తాప్సీది ఓ ప్రత్యేకమైన ఇమేజ్. తొలినాళ్లలో తను గ్లామర్ పాత్రలే పోషించింది. అయితే.. 'పింక్' సినిమా గ్లామర్ పాత్రల నుంచి ఆమెను గ్రామర్ పాత్రల వైపు మళ్లేలా చేసింది. దాంతో స్త్రీ ప్రాధాన్యతా చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచింది తాప్సీ. ప్రస్తుతం ఆమె హిందీలో 'గాంధారి' అనే చిత్రంలో నటిస్తున్నది. కిడ్నాప్ అయిన కూతుర్ని రక్షించుకోవడం కోసం ఓ తల్లి చేసిన పోరాటమే ఇతివృత్తంగా ఈ సినిమా రూపొందుతున్నది. దేవాశిష్ మఖిజా దర్శకుడు. ఈ సినిమా నిర్మాణం చివరి దశలో ఉంది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో 'గాంధారి' సినిమా గురించి మాట్లాడింది తాప్సీ. 'ఇప్పటివరకు చాలా సినిమాల్లో నటించాను. బాలీవుడ్‌తో పాటు ఇతర భాషల్లో కూడా సినిమాలు చేశాను. కానీ తల్లిగా నటించే అవకాశం మాత్రం రాలేదు. తొలిసారి 'గాంధారి'లో ఓ ఆడపిల్ల తల్లిగా నటిస్తున్నాను. నిజంగా ఇదినాకు అరుదైన అవకాశం. తల్లి పాత్రను ఆధారంగా చేసుకొని రూపొందే చిత్రాలకు సమాజంలో ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. ఎందరో తల్లులకు స్ఫూర్తినిచ్చే కథ ఇది' అని ఆనందం వ్యక్తం చేసింది తాప్సీ.

మాస్ లక్ష్యంగా హరుడు

శ్రీహరి, హెబ్బా పటేల్, వెంకట్ ప్రధాన పాత్రధారులుగా రూపొందుతోన్న చిత్రం 'హరుడు'. రాజ్ తాళ్లూరి దర్శకుడు. డాక్టర్ లక్ష్మణరావు డిక్కల, డాక్టర్ ప్రవీణ్‌రెడ్డి నిర్మాతలు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ దశలో ఉంది. ఈ సినిమాలో లీడ్ రోల్ చేస్తున్న శ్రీహరి ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని, గ్లింప్స్‌ని డైరెక్టర్ రామ్‌గోపాల్ వర్మ లాంచ్ చేసి, చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. అవుట్‌పుట్ బాగా వచ్చిందని, అందరికీ నచ్చే సినిమా అవుతుందని నిర్మాతలు నమ్మకం వెలిబుచ్చారు. సుమన్, సలోని, అలీ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఆనంద్, సంగీతం మణి జీనా.

'సిటాడెల్'తో గుర్తింపు

చెప్పాలని ఉంది, అలనాటి చిత్రాలు, శాకుంతలం, హ్యాపీ ఎండింగ్ వంటి సినిమాలతో హీరోగా గుర్తింపును తెచ్చుకున్నారు యష్ పూరి. తాజాగా విడుదలైన వెబ్‌సిరీస్ 'సిటాడెల్: హనీ బన్నీ'లో ఆయన కీలక పాత్రను పోషించారు. సమంత, వరుణ్ ధావన్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సిరీస్‌కు మంచి ఆదరణ లభిస్తున్నది. ఈ నేపథ్యంలో యష్ పూరి మాట్లాడుతూ 'ఈ సిరీస్ నా కెరీర్‌ను మరో మెట్టెక్కించింది. సమంత, వరుణ్‌ధావన్ వంటి టాలెంటెడ్ ఆర్టిస్టులతో కలిసి నటించడం వల్ల ఎన్నో విషయాలను నేర్చుకున్నా. ఈ సిరీస్ ద్వారా జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కినందుకు ఆనందంగా ఉంది. 'సిటాడెల్: హనీ బన్నీ' నా కెరీర్‌కు బ్రేక్‌నిచ్చింది. తెలుగులో మంచి అవకాశాల కోసం ఎదురుచూస్తున్నా. కొన్ని చిత్రాలు చర్చల దశలో ఉన్నాయి' అన్నారు.

ఉన్నదున్నట్లుగా మాట్లాడుతా!

యువ హీరో విశ్వక్‌సేన్‌ను కొత్త కథలకు కేరాఫ్ అడ్రస్‌గా చెబుతుంటారు. వాణిజ్య పంథాలోనే వినూత్న కథాంశాల్ని ఎంచుకుంటూ సినిమాలు చేస్తున్నారు. జయాపజయాలతో సంబంధం లేకుండా యూత్‌లో మంచి క్రేజ్ సంపాదించుకున్నారు. విశ్వక్‌సేన్ నటించిన తాజా చిత్రం 'మెకానిక్ రాకీ' ఈ నెల 22న విడుదలకానుంది. రవితేజ ముళ్లపూడి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని రామ్ తాళ్లూరి నిర్మించారు. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో విశ్వక్‌సేన్ పాత్రికేయులతో ముచ్చటిస్తూ పంచుకున్న విశేషాలు..

- గత నాలుగైదేళ్లుగా జరుగుతున్న ఓ బర్నింగ్ పాయింట్‌ను ఈ సినిమాలో చర్చించాం. అదేమిటన్నది తెరపై చూస్తేనే సర్‌ప్రైజింగ్‌గా ఉంటుంది. అసలు ఇంతకాలం ఎవరు ఎందుకు టచ్ చేయలేదనిపిస్తుంది. ఈ సినిమా స్క్రీన్‌ప్లే ఎవరూ ఊహించని విధంగా సాగుతుంది. ముఖ్యంగా సెకండాఫ్ థ్రిల్లర్ తరహాలో ఉత్కంఠను పంచుతుంది.
- ట్రైలర్‌లో కథను పెద్దగా రివీల్ చేయలేదు. ఈ సినిమాలో యాక్షన్‌తో పాటు ఎంటర్‌టైన్‌మెంట్ శాతం ఎక్కువగా ఉంటుంది. దర్శకుడు రవితేజ కొత్తవాడైనా అద్భుతంగా తెరకెక్కించాడు. ఈ సినిమా చూసిన తర్వాత దర్శకుడిగా అతని పని తీరుని మెచ్చుకుంటారు. యథార్థ సంఘటన ఆధారంగా దర్శకుడు ఈ కథను రాసుకున్నాడు. ప్రతి ఒక్కరూ కనెక్ట్ అయ్యేలా కథ సాగుతుంది.
- ఇది కేవలం హీరో క్యారెక్టర్ బేస్డ్ మూవీ కాదు. కథానాయికలు మీనాక్షి చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్, నరేష్, రఘు, సునీల్‌తో పాటు అందరి పాత్రలకు సమప్రాధాన్యం ఉంటుంది. సునీల్ గారితో సినిమా చేయాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నా. ఆ కోరిక ఈ సినిమాతో తీరింది.
- ఈ మధ్యే సినిమా చూసినప్పుడు చాలా హ్యాపీగా ఫీలయ్యా. ఇలాంటి సినిమాకు ప్రీమియర్స్ వేస్తే బాగుంటుందనిపించింది. పెద్ద ఎత్తున ప్రీమియర్ షోస్‌కు ప్లాన్ చేస్తున్నాం. మొన్న ప్రీరిలీజ్ వేడుకలో ట్రోలర్స్ గురించి మాట్లాడాను. నా మనసులో ఉన్న మాటలు చెప్పాను. కెరీర్ తొలినాళ్ల నుంచి నేను ఇలాగే ఉన్నా. డిప్లొమాటిక్‌గా ఉండటం నాకు తెల్వదు. ఉన్నదున్నట్లుగా మాట్లాడుతా. ఇందులో కొత్తగా నేర్చుకొని ప్రవర్తించేదీ ఏమీ లేదు. నా వ్యక్తిత్వమే అలాంటిది.
- ప్రస్తుతం చేస్తున్న సినిమాల వివరాల్లోకి వెళ్తే..'లైలా' అరవైశాతం పూర్తయింది. అనుదీప్ దర్శకత్వంలో సినిమా జనవరిలో ప్రారంభమవుతుంది. 'కల్ట్' చిత్రాన్ని మార్చిలో మొదలుపెడతాం. 'ఈ నగరానికి ఏమయింది' సీక్వెల్‌కు సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ జరుగుతున్నది. వచ్చే ఏడాది ఈ సినిమా పట్టాలెక్కుతుంది. సాగర్ కె చంద్ర దర్శకత్వంలో కూడా ఓ సినిమా చేయబోతున్నా.

ఇల్లెందు రాంబాయి ప్రేమకథ

'నీది నాది ఒకే కథ' 'విరాటపర్వం' వంటి వినూత్న కథా చిత్రాలతో దర్శకుడిగా తనదైన ముద్రను వేశారు దర్శకుడు వేణు ఊడుగుల. ఆయన నిర్మాతగా మారి తొలి ప్రయత్నంగా రూపొందిస్తున్న చిత్రానికి 'రాజు వెడ్స్ రాంబాయి' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సినిమా ద్వారా సాయిలు కంపాటి దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. డోలా ముఖి సబాల్టర్న్ ఫిల్మ్స్, మాన్సూన్ టేల్స్ పతాకంపై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వరంగల్, ఖమ్మం సరిహద్దులోని ఓ గ్రామంలో జరిగిన యథార్థ సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ చిత్ర టైటిల్ గ్లింప్స్‌ను మంగళవారం విడుదల చేశారు. ఇందులో కథానాయికను యెనగంటి రాంబాయి పాత్రలో పరిచయం చేశారు. బొగ్గు గనుల ప్రాంతమైన ఇల్లెందు మండలం నేపథ్యంలో అందమైన గ్రామీణ ప్రేమకథగా తీర్చిదిద్దినట్లు గ్లింప్స్ చూస్తే అర్థమవుతున్నది. ఈ సందర్భంగా నిర్మాత వేణు ఊడుగుల మాట్లాడుతూ 'కథ జరిగిన ప్రాంతం, అక్కడి మనుషుల అమాయకత్వం, వారి మధ్య సంఘర్షణ నన్ను ఎంతగానో కదిలించింది. ముఖ్యంగా క్లైమాక్స్ ఘట్టాలు కొన్ని రోజుల పాటు నిద్రపోనివ్వలేదు. ఇంతటి వైవిధ్యమైన ప్రేమకథను ఇప్పటివరకు వినలేదు. ఈ కథ విని ఈటీవీ విన్ వాళ్లు మాతో కలిసి పనిచేయడానికి ముందుకొచ్చారు' అని చెప్పారు. ఈ కథలోని పాత్రలన్నీ సహజంగా కనిపిస్తాయని ఈటీవీ విన్ హెడ్ సాయికృష్ణ పేర్కొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: వాజిద్ బేగ్, సంగీతం: సురేష్ బొబ్బిలి, నిర్మాతలు: వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి, రచన-దర్శకత్వం: సాయిలు కంపాటి.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333